క్లుప్తంగా

నిధుల కొరతతో ఇబ్బందులు



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీల్లో నిధులు లేక సొంత నిధులు ఖర్చుచేస్తూ ఇబ్బందులకు గురవుతున్నామని మండల పంచాయతీ కార్యదర్శులు వాపోయారు. ఫిబ్రవరి నుంచి పంచాయతీలకు ఎలాంటి నిధులు రాలేదని, పంచాయతీల్లో తాము ఎదుర్కొంటున్న నిధుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తాకు వారు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జీతాలు ఇప్పించండి సారూ..



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): తొమ్మిది నెలలుగా అందని జీతాలను ఇప్పించాలంటూ మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు ఎంపీడీఓ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో తీవ్ర ఇబ్బందులు పడుతూ పనులు చేస్తున్నామని, అనారోగ్యాలకు గురైనా పనులు ఆపలేదన్నారు. 9నెలలుగా జీతాలు రాలేదని వాపోయారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న జీతాలతోపాటు గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాలయ్య, ప్రభాకర్, మాణయ్య, యాదగిరి, వెంకయ్య, సంజీవులు, రాజు, సుదర్శన్, రత్నయ్య, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితో అభివృద్ధి



ఎంపీపీని సన్మానిస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల సహకారం, అన్ని శాఖల సిబ్బంది కృషితోనే శివ్వంపేట మండల అభివృద్ధికి కృషిచేశానని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. గురువారంతో ఎంపీటీసీల కాలపరిమితి ముగుస్తుండడంతో పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పర్యాయాలుగా ఎంపీపీగా అభివృద్ధికి కృషిచేయడం ఆనందంగా ఉందన్నారు. పదవి లేకపోయినా ప్రజల సంక్షేమం కోసం నిరంతరాయంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, నాయకులు కృష్ణాగౌడ్, దశరథ్, అశోక్, ఆంజనేయులు, హర్షనాయక్ తదితరులు ఉన్నారు.

'వెదజల్లు'తో ఖర్చులు ఆదా



అవగాహన కల్పిస్తున్న లావణ్య

శివ్వంపేట(నర్సాపూర్): వెదజల్లే విధానం ద్వారా వరిసాగుచేస్తే ఖర్చులు తగ్గుతాయని మండల వ్యవసాయ అధికారి లావణ్య చెప్పారు. మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామంలో వెదజల్లే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలకరి వర్షాలు కురిసినప్పుడు నేలను దున్ని రోటవేటర్‌తో చదును చేయాక విత్తనం వేయాలన్నారు. ఎకరాకు 10 నుండి 12కిలోల వరి విత్తనాలు వాడుకోవాలని చెప్పారు. సీడ్ డ్రిల్ సాయంతో కూడా విత్తుకోవచ్చునని, ఈ విధానం ద్వారా కూలీ, దమ్ము ఖర్చులు ఆదా అవుతాయని సూచించారు. అలాగే 10నుండి 15రోజుల ముందుగానే పంట చేతికి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ మాజిద్ అలి, రైతులు లక్ష్మీనారాయణ, మమత, తదితరులు ఉన్నారు.

ఉద్యోగ కల్పనలో విఫలం



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని బీజేపీ నాయకులు రాములు, యాదగిరి తదితరులు ఆరోపించారు. గురువారం వారు తహసీల్దార్ సతీశ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం కూడా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభు త్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బ్రహ్మం, సాయాగౌడ్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై విచారణ ఏది?

నీట్ ప్రశ్న పత్రం లీక్‌కు నిరసనగా పలు విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్ నిర్వహించాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కాలేజీలను గురువారం మూసివేయించి నిరసన తెలిపారు. ప్రశ్నపత్రం లీక్ అవ్వడంపై సమగ్ర విచారణ చేపట్టాలని, నీట్ పరీక్షను రద్దుచేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.



మనోహరాబాద్‌లో వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): నీట్ ప్రశ్నపత్రం లీక్ అవ్వడంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గానుగు రామకృష్ణ, మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ గోపాల్ డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌లో నర్సింహాచారి, శ్రీనివాస్, సర్వేశ్‌గౌడ్, సత్యనారాయణ, శేఖర్, శ్రవణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

నర్సాపూర్: మండలంలో నిర్వహించిన పాఠశాలల బంద్ కార్యక్రమం విజయవంతం అయిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హర్షవర్ధన్ చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభులింగం, ఆంజనేయులు, రవితేజ, యాదుల్, అంజి, రవి, పవన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్)లో..

మండల కేంద్రం వెల్దుర్తిలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలను ఎన్ఎస్‌యూఐ నాయకులు బాయ్‌కాట్ చేయించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రవితేజ మాట్లాడుతూ నీట్ పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పెద్దశంకరంపేట(మెదక్)లో..

మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, మహేశ్‌గౌడ్, శ్యామ్, మహిపాల్‌గౌడ్, అరుణ్, పవన్, రాజేశ్ తదితరులున్నారు.



పెద్దశంకరంపేటలో.. ఇండ్లకు వెళ్తున్న విద్యార్థులు

టేక్మాల్‌లో..

టేక్మాల్‌లో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ ప్రసాద్, గౌతమ్, చరణ్ తేజ, నరసింహ, శ్రీకాంత్, ప్రవీణ్, రఘుపతి, బాలరాజు, భాగయ్య తదితరులు ఉన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్)లో..

మండలం కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ సభ్యులు శ్యామ్, ముస్తఫా, శ్రీకాంత్, దుర్గేశ్, హనుమంతు, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టేక్మాల్ మోడల్ స్కూల్ ఎదుట నిరసన



పాపన్నపేట(మెదక్)లో..

మండలంలోని పాఠశాలలు, కాలేజీలను ఎస్ఎఫ్‌ఐ నాయకులు మూసివేయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నరేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): హెచ్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ సభ్యులు

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు



నందిని



ప్రణతి



స్పందన



కీర్తన



అనూష



సచితశ్రీ

టేక్మాల్(మెదక్)/పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులు నందిని, ప్రణతి, స్పందన, అనూష పదో తరగతిలో 9.8జీపీఏ సాధించినట్టు ఆయన చెప్పారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. పెద్దశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు పి.సచితశ్రీ, కీర్తన ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ తెలిపారు. పదో తరగతిలో వారు ఉత్తమ ప్రతిభ కనపర్చారని చెప్పారు. వారిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

సాగులో ఉన్న భూములకే రైతు భరోసా



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి గోవింద్

వెల్దుర్తి(తూప్రాన్): రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ జిల్లాలో పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి అధ్యక్షతన రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పది ఎకరాల లోపు భూమి ఉన్నవారికి మాత్రమే రైతు భరోసా అందించాలని ఎక్కువ మంది రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సాగు చేసిన విస్తీర్ణం ప్రకారం మాత్రమే అందించాలని సూచించారు. గ్రామాల్లో వెంచర్లు వేసినవాటికి, బీడు భూములకు, సాయం అందించవద్దని చెప్పారు. రైతులకు ట్రాక్టర్, కారు, బైక్ వంటి వాటి నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ మాట్లాడుతూ. రైతుల నుండి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పుణ్యవతి, ఏఓ ఝాన్సీ, ఏఈఓలు వందన, సాయికిరణ్, సొసైటీ సీఈఓ సిద్దయ్య, డైరెక్టర్‌లు నర్సింహులు, సత్యనారాయణ, పోతిరెడ్డి, రమేశ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య స్ఫూర్తితో పోరాటాలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. గురువారం కేవల్ కిషన్ భవన్‌లో కొమురయ్య 78వ వర్ధంతి నిర్వహించారు. కొమురయ్య చిత్ర పటానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానాధీశుడు 7వ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం ప్రజలు చేసిన వీరోచిత పోరాటాన్నే తెలంగాణా సాయుధ పోరాటంగా పిలుస్తారన్నారు. నైజాం అల్లరి మూకలు, విసునూర్ తుపాకీ తూటాలకు నేలరాలిన అరుణతార దొడ్డి కొమురయ్య తెలంగాణ పోరాటంలో చెరగని ముద్రవేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బి.బస్వరాజ్, నర్సమ్మ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆశయసాధనకు కృషి చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్):తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయిని మధు పిలుపునిచ్చారు. కొమురయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక వెటర్నరీ ఆసుపత్రి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళర్పించారు. కార్యక్రమంలో గంగారాం, కుమార్, గంగారెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

● బీజేపీ రాష్ట్ర నేత రమేశ్ గౌడ్

నర్సాపూర్ రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బీజేపీ రాష్ట్ర ఓబీసీడీ ఉపాధ్యక్షుడు రమేశ్ గౌడ్ అన్నారు. అమ్మ పేరు మీద మొక్క నాటండి అనే కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని నత్నయ్యపల్లిలో కార్యకర్తలతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణంతో పాటు ముందు తరాలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వాలనుకుంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో నగేష్, రాజేశ్, సాయినాథ్, నరేందర్, సత్యనారాయణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: మొక్క నాటుతున్న నాయకులు

మొక్కలను సంరక్షించాలి

రామాయంపేట(మెదక్): స్థానిక స్నేహబంధు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. నాటిన మొక్కలను సంరక్షించాలని క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసరావు, సాగర్, రవీందర్‌గౌడ్, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడంపై అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): వన మహోత్సవంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు మొక్కలు ఎలా నాటించాలో అనే అంశంపై ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ సతీశ్, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై నిర్లక్ష్యం వద్దు



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని బీజేవైఎం మండల అధ్యక్షుడు వడ్ల పవన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే నోటిఫికేషన్లు విడుదలచేసి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని నియామకాల్లోను మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలని కోరారు. కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీఓ46ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాజు, సిద్దిరాములు, రాములు, అశోక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు వీరే..

స్థానిక సంస్థల పదవీ కాలంలో ముగియడంతో ప్రభుత్వం మండల ప్రత్యేక అధికారులను నియమించింది. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో పలువురు ప్రత్యేక అధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. వారికి ఎంపీడీఓలు, ఆయా కార్యాలయాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్)/నర్సాపూర్/చిలప్‌చెడ్(నర్సాపూర్)/కౌడిపల్లి(నర్సాపూర్)/నిజాంపేట(మెదక్)/మనోహరాబాద్(తూప్రాన్)/పెద్దశంకరంపేట(మెదక్): చినశంకరంపేట మండల ప్రత్యేక అధికారిగా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి విజయ్ శేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అలాగే నార్సింగి మండల ప్రత్యేక అధికారిగా డీసీఎస్ఓ బ్రహ్మారావు బాధ్యతల్లో చేరారు. అదేవిధంగా నర్సాపూర్ మండలం ప్రత్యేక అధికారిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు, చిలప్‌చెడ్ మండల ప్రత్యేకాధికారిగా బి.మాన్యనాయక్, కౌడిపల్లి మండల ప్రత్యేకాధికారిగా నర్సాపూర్ డీఎల్‌పీఓ యాదయ్య, నిజాంపేట మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయ అధికారిగా గోవింద్, మనోహరాబాద్ మండల ప్రత్యేక అధికారిగా తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, పెద్దశంకరంపేట ప్రత్యేకాధికారిగా జిల్లా సివిల్ సప్లయ్ డీఎం డి.హరికృష్ణ బాధ్యతలు చేపట్టారు.



నార్సింగిలో బ్రహ్మారావును అభినందిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

ఐదేళ్ల కాలం సంతృప్తినిచ్చింది



కృష్ణారెడ్డిని అభినందిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): తన ఐదేళ్ల పదవీ కాలంలో నార్సింగి మండల అభివృద్ధికి చేసిన కృషి ఎంతో సంతృప్తిని ఇచ్చిందని జెడ్పీటీసీ భానపురం కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కర్నాల్‌పల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవితో సంబంధం లేకుండా నార్సింగి మండల అభివృద్ధికి మరింత కృషిచేస్తానని చెప్పారు. ఎంపీపీ సబిత, వైస్ ఎంపీపీ సుజాత, నార్సింగి, చిన్నశంకరంపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షులు కుమ్మరి బాబు, పట్లోరి రాజు ఆయనను సత్కరించి అభినందించారు.

శ్మశాన వాటిక కబ్జాపై వినతి

నర్సాపూర్: మండలంలోని కాగజ్‌మద్దూర్ గ్రామానికి చెందిన దళితుల శ్మశాన వాటిక భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం ఆయన గ్రామానికి చెందిన దళితులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితుల స్మశాన వాటిక భూమిని కాపాడాలని నెల క్రితం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినా ఇంత వరకు సర్వే చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు శ్మశాన వాటిక భూమిని కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని కాపాడాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, కుమార్, యాదయ్య, లచ్చయ్య, దేవరాజు, సాలయ్య, శోభ, లక్ష్మి, యశోద, సుశీల, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయులే మనకు ఆదర్శం



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నేతలు

టేక్మాల్(మెదక్): మహనీయులే మనకు ఆదర్శమని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ చింత స్వప్నరవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకొని యువకులంతా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీపీఓతోపాటు పలువురు నాయకులు, యువకులను ఎంపీపీ స్వప్న సన్మానించారు. జెడ్పీటీసీ సరోజ, వైస్ ఎంపీపీ మంజుల, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దిన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు నిమ్మ వాణి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మజహర్, నిమ్మ రమేశ్, వీరప్ప, సుప్రజ, శేషు, భాస్కర్, సాగర్, సిద్దయ్య, సలీమ్, రాజుగౌడ్, శివరాజ్, నర్సింహారెడ్డి, రాజేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీతో అత్యవసర వైద్యం



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఎల్‌ఓసీతో అత్యవసర వైద్యం పొందే అవకాశం ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. కౌడిపల్లి మండలం రాజిపేటకు చెందిన రవికి శస్త్ర చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేలు ఎల్‌ఓసీని ఆమె అతడి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్, సత్యంగౌడ్, జ్ఞానేశ్వర్, పాషా, యాదాగౌడ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వైద్య పరీక్షలు**

నర్సాపూర్: ప్రభుత్వం నిర్వహించే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఒకటో వార్డులో గురువారం నిర్వహించిన హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. వైద్యులు ప్రజలకు పరీక్షలుచేసి మందులు అందజేశారు. డాక్టర్ స్వప్న, ఏఎన్ఎంలు నిర్మల, లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

◆ **కబ్జా ప్రయత్నాలు విరమించుకోవాలి**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం శివారులోని 1179సర్వే నంబర్‌లో లీజుకు తీసుకున్న భూములను కబ్జాచేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని అసైన్డ్ భూముల రక్షణ కమిటీ జిల్లా నాయకుడు శివరాజ్ డిమాండ్ చేశారు. రైతులతో కలిసి గురువారం ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు.

◆ **84మందికి చికిత్సలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఆరోగ్య మహిళా క్లీనిక్‌లో గురువారం 84 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ ఫెర్నాజ్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలు, బాలికలను పరీక్షించారు. 52 మందికి రక్తపరీక్షలు కూడా చేసినట్లు చెప్పారు.

◆ **టిప్పర్ల వేగాన్ని అదుపు చేయాలి**

నర్సాపూర్: నర్సాపూర్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న టిప్పర్ల వేగాన్ని అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మట్టి టిప్పర్ల వల్ల ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి వాటి వేగాన్ని అదుపు చేయాలని అభ్యర్థించారు.

◆ **కళాశాలకు ప్రింటర్ అందజేత**

చిన్నశంకరంపేట(మెదక్): స్థానిక ప్రభుత్వ కళాశాలకు నాన్‌టీచింగ్ సిబ్బంది రూ.20వేలు విలువైన లేజర్ ప్రింటర్‌ను బహూకరించారు. గురువారం ప్రిన్సిపాల్ నాగేందర్‌కు ఆ ప్రింటర్‌ను అందజేశారు. వారిని ప్రిన్సిపాల్ అభినందించారు.

◆ **74మంది ఉపాధ్యాయుల బదిలీ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో 74మంది ఎస్‌జీటీ ఉపాధాయులు బదిలీ అయినట్లు ఎంఈఓ బుచ్చానాయక్ తెలిపారు. మండలంలో 44 ప్రాథమిక పాఠశాలల్లో 103మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీలలో 74మంది బదిలీ కాగా 41 మంది రిలీవ్ అయినట్లు చెప్పారు.

◆ **వాహనాల తనిఖీ**

పెద్దశంకరంపేట(మెదక్): వాహనదారులు సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్‌లను కలిగి ఉండాలని ఎస్ఐ శంకర్ అన్నారు. గురువారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలను సీజ్ చేశారు. నిబంధనలు మారాయని చెప్పారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): అప్పులు తీర్చలేక మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ధరిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ కథనం ప్రకారం గ్రామానికి చెందిన రాఘవుల నర్సింహులు(41) జీహెచ్ఎంసీ ఓల్డ్ అల్వాల్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసి తీర్చేమార్గం కన్పించక పోవడంతో ఒకటో తేదీన తన పొలంవద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు గమనించి అతడిని మెదక్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో మృతి చెందాడు. అతడి భార్య నాగమణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మరో యువకుడు..

తూప్రాన్: మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పానగాంటి రమేశ్ (26) మద్యానికి బానిసై పది రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలోఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.